**కా**లింగ్‌బెల్ మ్రోగింది.

ఈసారి ఆపకుండా, ఊపిరి పీల్చకుండా మ్రోగుతూ జ్యోత్స్నని మెలకువలోకి తీసుకు వచ్చింది. జ్యోత్స్న విసుగునుంచి మహా విసుగు లోకి పయనిస్తున్నట్టుగా మొహాన్ని చిట్లించుకుంటూ లేచింది. విసుగ్గా విసురుగా మొహాన్ని పరుచు కున్న ముంగురులని వెనక్కి కూడా తోసుకోకుండా అలాగే వచ్చి తలుపు తీసింది.

జనవరి చలిలో – వణుక్కుంటూ పాలపాకెట్ ని పట్టుకుని నిల్చున్న డెబ్బై ఏళ్ళ ముసల్ది. మొహం చిట్లించుకుంటూ, పేకెట్‌ని అందుకోవ డానికి చెయ్యి చాస్తూ – "అంత గట్టిగా బెల్ కొట్టావేం?" అంది కఠినంగా. ముసల్ది వణుకుతూ – "అంతకుముందు నాలుగుసార్లు కొట్టినా తమకు వినబళ్ళేదు. అందుకని –" అంటుండగా పాకెట్‌ని అందుకుని విసుగ్గా ధడాలున తలుపు వేసింది.

ముసల్ది మంచు తెరలని చీల్చుకుని కదులుతూ – "ఏవిటో ... ఈ అమ్మ ఎప్పుడూ పచ్చిమిరప కాయ కొరికిన కాకిలా మండిపడతా వుంటది –" అని గొణుక్కుంది.

పాల పేకెట్ కిచెన్‌రూం టేబిల్ మీద పడేసి, బాత్రూంలోకి వెళ్ళి, పేస్టుని బ్రష్‌మీదకి కఠినంగా నొక్కుకుని, బ్రష్ చేసుకుని మొహం మీద నీళ్ళు చిలకరించి, ఆ నీళ్ళ చలికి వణుక్కుంటూ లోప లికి వచ్చి టవల్ కోసం వెతుక్కుని కనబడక చీర చెంగుతో తుడుచుకుంది.

అప్పటికి సమయం 6 దాటుతోంది. బయట చీపురుతో పనిమనిషి వరండా తుడుస్తున్న శబ్దం వినిపిస్తోంది. మంచంమీద ఒళ్ళెరగని గాఢ నిద్రలో వున్న భర్త మూర్తిని చూడగానే జ్యోత్స్నకి ఒళ్ళు మండింది. 'చూడు! మహారాజులా ఎలా పడుకు న్నాడో! తను ఈ చలికి వణుక్కుంటూ చాకిరీ చెయ్యాలి' ఆమె హృదయం ఈర్ష్యతో మూలిగింది. ఆ క్షణంలో ఆమెకి గుర్తుకురాలేదు – రాత్రి 2 గంటల వరకు ఆఫీస్ ఎకౌంట్స్ ఫైల్స్ సూపర్‌వైజ్ చేశా డని, మధ్యాహ్నం సమయంలో తను భోంచేసి తీరిగ్గా నడుం వాల్చే సమయంలో, అతను ఆఫీ సులో బిజీగా కంప్యూటర్ ఫైల్స్ చెక్ చేస్తూ వుంటాడని.

హాల్లోకి వచ్చి ఐదేళ్ళ కూతురు అంజలి పడుకున్న మడత మంచం క్రింద చేరిన నీళ్ళు చూడగానే – 'అబ్బ. ఏం పిల్లరా భగవంతుడా? కనకుండా వున్నా బావుండేది. దీనికి చాకిరీ చెయ్యలేక చావొ స్తోంది. ఇన్నేళ్ళొస్తున్నా, ఇంకా పక్క తడపడం మానలేదు' అనుకుంది.

** ** **

మూర్తికి మెలకువ వచ్చింది. లేచి రాత్రి తను చూసిన ఫైల్స్‌ని మరోసారి తిరగేసి, తర్వాత బాత్రూంలో మొహం కడుక్కుని షేవింగ్ సెట్ తీసి, అలా హాల్లోకి వచ్చి, ఒక చేత్తో పేపరు అందుకుని, మరో చేత్తో క్రీమ్‌ని గడ్డానికి పట్టించసాగాడు.

"జో..." అని పిలిచాడు.

వంటింట్లో ఉప్మా కలబెడుతున్న జ్యోత్స్న ఆ పిలుపు వినగానే విసురుగా గయ్‌మంది. "మొద లెట్టారూ! జ్యోత్స్నా అని పిలవడానికి కూడా సోమరితనమే! జో... అంట జో..." తను అలా పిలిచినప్పుడల్లా ఆమె నోటి విసురు తనకి తగులుతూనే వుంటుంది. అయినా తనకెందుకో అలా 'జో' అని పిలవడం ముద్దు. కానీ ఆమెకి ఎందుకో తన 'ముద్దు' అర్థం కాదు.

"కాఫీ ఇస్తావా జ్యోత్స్నా" అడిగాడు.

"ఇదే పని ... టిఫిన్ ముందు కాఫీ, తర్వాత కాఫీ – నా వల్లకాదు ఇది హోటలూ కాదు. ఉప్మా తగలేస్తున్నా. అది తిన్నాక ... ఇస్తా" అంది గట్టిగా.

రోజూ ఇది మామూలే. ఎన్ని రోజుల్నుంచి... ఆరు సంవత్సరాల నుంచీ ప్రతీరోజూ ఇంతే. తనకి షేవ్ చేసుకుంటూ, పేపర్‌లో హెడ్‌లైన్స్ చదు వుతూ, కాఫీ త్రాగడం ఇష్టం. కానీ ఆమె అది ఎక్స్‌ట్రా పని అనుకుంటుంది. తను అడగడం – ఆమె కాదనడం – ఆలోచనలోనే షేవ్ చేసుకుని, వెళ్ళి హీటర్‌లోని వేడి నీళ్ళకి చన్నీళ్ళు తొలుపుకుని స్నానం చేశాడు. అప్పటికి 7 గంటలు అవుతోంది. గబగబ డ్రస్ చేసుకుని, ఆమె అందించిన ఉప్మా ఒక స్పూన్ నోట్లో పెట్టుకున్నాడు. 'ఉప్పు ఎక్కువ' కానీ ఆ మాట మనసులోనే వుండిపోయింది. వెళ్ళి కొంచెం పెరుగు ప్లేట్లో పోసుకున్నాడు. అది గమనించి – 'ఛీ! ఏం అలవాట్లో ... ఏం రుచులో!' అని విసుక్కుంది. మూర్తి సమా ధానం చెప్పకుండా గబగబ తినడం పూర్తిచేసి షూస్



"వెయ్యి చిర్నవ్వుల్ని వికసింపనియ్యి!"

జయ



పాలిష్ చేసుకుని, సాక్సు తొడుక్కుంటున్నాడు. జ్యోత్స్న బాక్సులో పెరుగన్నం కలిపి, నిమ్మకాయ బద్దవేసి బాక్సు అందించింది. రోజూ అతను ఎనిమిది గంటలకి వెళ్ళిపోవాలి అని ఆమెకి తెలుసు. కొద్దిగా ముందు లేచి, అతనికి నచ్చిన కూర చేసి లంచ్‌బాక్సులో పెడదాం అని మాత్రం అనుకోదు. అసలా ఆలోచన ఎందుకో ఆమెకి రాదు. చాలామంది మగవాళ్ళల్లా అతనికి కాంటీన్‌లో, హోటల్స్‌లో తినడం అంటే ఇష్టం వుండదు. పెరుగన్నం అయినా, ఇంటి నుంచి తీసుకువెళ్ళిందే తింటాడు. బాక్సు అందుకుని, సూట్‌కేస్‌లో ఫైల్స్ సర్దుకుని హీరో హోండా స్టార్ట్ చేశాడు.


మూర్తి వెళ్ళిపోయేసరికి ఆమెకి ఏదో పెద్ద బరువు దిగినట్టయింది. కూతురు గుర్తుకు రాగానే 'ఈ సంత ఒకటి వుంది' అనుకుంటూ బొమ్మలతో ఆడుకుంటున్న అంజలిని బరబర ఈడ్చుకు వెళ్ళి, ఇంకా పూర్తిగా వేడి కాని నీళ్ళతో – 'అమ్మోయ్! చలే!' అని ఏడుస్తున్నా పట్టించుకోకుండా నాలుగు చెంబులు నీళ్ళు గుమ్మరించి స్నానం పూర్తిచేసి, కాన్వెంట్ డ్రెస్ వేసి, నోట్లో ఇంత ఉప్మా కుక్కి, బ్యాగ్ తగిలించి, కాన్వెంట్‌కు తీసుకుని వెళ్ళే రిక్షా వాడికి అప్పచెప్పింది.

కూతురు వెళ్ళగానే, 'హుష్' అని నిట్టూరుస్తూ సోఫాలో కూలబడింది. పనిమనిషి బట్టలు వుతకడం వినిపిస్తోంది. ఏవిటో తెలీని విపరీతమైన నీరసం, నిస్సత్తువ. 'వీళ్ళకి చాకిరీ చేసి చేసి ఆరోగ్యం తగలడింది' అనుకుంది నిరసనగా.

అప్పటికి పదిగంటలు దాటుతోంది. టిఫిన్ తిని, కాఫీ తాగి అలా సోఫాలో నడుం వాలుద్దామని హాల్లోకి వస్తుంటే, కిటికీలోంచి ఇంటిముందు ఆటో ఆగుతూ కనిపించింది.

ఎవరా అని కుతూహలంగా చూసేసరికి ఆశ్చర్యంతో జ్యోత్స్న కళ్ళు వెడల్పయ్యాయి. 'వికాస్' ఆనందంగా అనుకుంటూ, మైమరచిపోయి తలుపులు తీసుకుని, అలా గాల్లో తేలుతున్నట్టుగా ఆటో దగ్గరికి వచ్చింది.

శీతాకాలపు చలిలో చిరువెచ్చటి వెలుగులతో రూపుదిద్దినట్టుగా, వర్షాకాలపు గాలికి జలజలమని రాలిపోయే పున్నాగ పూల సువాసన వరదలా, వికాస్ సూట్‌కేస్ అందుకుని నవ్వుతూ ఆటో దిగాడు. తనవైపు వస్తున్న జ్యోత్స్నకి చెయ్యి వూపి, మీటరు చూసి, పర్సు కోసం పాకెట్‌లో చెయ్యి పెట్టబోయి – ఆగి చిర్నవ్వు నవ్వుతూ – ఆటో డ్రైవర్ వైపు కుడి చెయ్యి చాచి – "పీటర్! థాంక్యూ. చాలా కంఫర్టబుల్‌గా, తక్కువ టైమ్‌లో తీసుకువచ్చావు. డ్రైవింగ్‌లో నువ్వు ఎక్స్‌పెర్ట్ అనిపిస్తోంది. నీ డ్రైవింగ్ చాలా స్మూత్‌గా, ఎంజాయబుల్‌గా వుంది. ఒన్స్ ఎగైన్ థాంక్యూ ఫర్ ఏ కంఫర్టబుల్ రైడ్" అంటూ షేక్ హ్యాండ్




ఇచ్చాడు. అసలు వికాస్ అంటున్న విషయం ఏమిటో ముందు అర్థం కానట్టుగా అనిపించినా, అర్థం అయ్యి, అది అభినందన అని తెల్సుకోగానే పీటర్ మొహం చిర్నవ్వుతో విచ్చుకుంది.

మొహమాటంగా నవ్వేస్తూ, గొణుగుతున్నట్టుగా "థాంక్యూ" అన్నాడు. వంద తీసి ఇస్తున్న వికాస్‌ని చూసి – 'ఛేంజ్ లేదు సార్' అన్నాడు. వికాస్ నవ్వుతూ, ఆత్మీయంగా – "నీకు పిల్లలున్నారా పీటర్?" అన్నాడు. "ఒక బాబు వున్నాడు సార్". వికాస్ ప్రక్కనే వున్న బంకులో క్యాడ్‌బరీస్ చాక్లెట్స్ నాలుగు కొని, ఛేంజ్ తీసుకుని, మీటరు రీడింగ్ ప్రకారం 20 రూపాయలు ఇచ్చి చాక్లెట్స్ అందిస్తూ – "మీ బాబుకి అంకుల్ ఇచ్చాడని ఇవ్వు పీటర్" అన్నాడు.

పీటర్ ఏనిమిదో వింత చూస్తున్నట్టుగా ఆ చాక్లెట్లని అందుకుని, ఈసారి థాంక్స్ చెప్పడం కూడా మరిచిపోయాడు. "మీటర్ మీద ఎక్స్‌ట్రా 2 రూ.లు అన్నావు కదా – ఇదిగో" అని ఇవ్వబోతుండగా, పీటర్ అడ్డం పడి – "వద్దు సార్! వస్తాను సార్! థాంక్యూ!" అని ఆటోలో కూర్చుని స్టార్ట్ చేస్తూ – మరోసారి వికాస్‌ని చూసి, ఆత్మీయంగా నవ్వి, అప్రయత్నంగా సాల్యూట్ చేసి వెళ్ళిపోయాడు. వికాస్ నవ్వుతూ చెయ్యి వూపాడు.

ఇదంతా నోట మాట రానట్టు చూస్తూ నిల్చుండిపోయిన జ్యోత్స్నవైపు తిరిగి – "హలో .. గుడ్‌మార్నింగ్ జ్యోత్స్న. ఆఫ్టర్ ఏ లాంగ్ టైమ్..." అని నవ్వాడు.

తలవూపి – "నీకేమైనా మతిపోయిందా వికాస్ –" అంది.

వికాస్ నవ్వేస్తూ – "మతి వున్న వాళ్ళు చేసే పనులు ఏమిటో నువ్వు చెబితే, నేను చేసింది మతిపోయి చేసిన పనా కాదా అన్నది తేలిగ్గా అంచనా వెయ్యొచ్చు."

"తెలివిగా మాట్లాడకు వికాస్. ఆటోవాడు ఏదో గొప్ప కార్యం చేస్తున్నట్టు అభినందించావే! ఆఫ్ట్రాల్ వాడు నిన్ను ఎక్కించుకున్నాడు. మీటరు చార్జి చెల్లించి నువ్వు వచ్చావు – కానీ నువ్వు ---" అని ఆపేసింది. జ్యోత్స్నతో పాటు లోపలికి నడుస్తూ వికాస్ చిర్నవ్వుతో – "జీవితంలో ఒక చిన్న రహస్యం వుంది జ్యోత్స్నా. ఇది చాలామందికి తెలీక ఇరుకు జీవితాలు గడుపుతూ వుంటారు. ప్రతీ మనిషికి ఆనందం కావాలి. కానీ అది అంత తేలిగ్గా దొరకదు. అవతలి వ్యక్తికి నువ్వు ఆనందం ఇవ్వగలిగితే – నీకు ఆనందం కలుగుతుంది. నీకు ఒక చిన్న కథ చెబ్తా – ఇద్దరు వ్యక్తులకి చేతులకి సంకెళ్ళు, ఇనుప గొలుసులు కట్టేశారు. ఎదురుగా నిండు భోజనం. కడుపులో ఆకలి, కానీ తమ చేతులతో తాము తినలేరు. కానీ ఒకళ్ళ కొకళ్లు తినిపించుకోగలరు. చాలాసేపు ఆకలితో మాడి, తర్వాత ఒకళ్ళకొకళ్ళు తినిపించుకుని తృప్తిపడ్డారు. అలా నువ్వు ఒక చిర్నవ్వు మరో మొహంలో వెలిగించగలిగినప్పుడే నీ మొహంలో చిర్నవ్వు ఉదయిస్తుంది."

జ్యోత్స్న వింతగా చూసింది. కానీ ఆ మాటల్లో వున్న శక్తి, విశ్వాసం మెల్లిగా ఆమెని కూడా చేరుకుంటున్నాయి.

"ప్రపంచంలో ప్రతీదాన్నీ డబ్బుతో కొలవడం, సాకర్యాలని ఇచ్చిపుచ్చుకోవడాలు జీవితాన్ని నిస్సారం చేస్తాయి. ఇంట్లో నువ్వు నీళ్ళు పోసిన గులాబీ చెట్టు ఎర్రటి గులాబీని పూస్తే, నువ్వు 'ఇన్ని రోజులుగ నీళ్ళు పోశాను కాబట్టే, పువ్వు పూసింది' అని అనుకుని నిర్లక్ష్యం చేస్తావా? లేదే? ఒకవేళ అలాచేస్తే నీకు జీవన మాధుర్యం తెలీదనుకోవాలి.

విజయవంతమైన చికిత్స

## తెల్ల మచ్చలు

మా శక్తివంతమైన మరియు త్వరితగతిన ఫలితమునిచ్చెడి ఆయుర్వేద చికిత్స ప్రారంభించిన 36 గంటలలోగా మచ్చల యొక్క రంగు మారటాన్ని మీరే గమనిస్తారు. మరియు త్వరలోనే సహజమైన శరీరపు రంగులోనికి మారుతుంది. మీరు ఇతర చికిత్సల ద్వారా విసిగిపోయి వున్నట్టైతే ఒక్కసారి మా వైద్య చికిత్స ద్వారా ప్రయత్నించండి. సంతృప్తి చెందండి! రోగులు చికిత్స కొరకు వారి వ్యాధి వివరాలను దయచేసి వ్రాయండి. పరీక్షించే నిమిత్తం ఒక ప్యాకెట్ మందు ఉచితంగా ఇవ్వబడుతుంది.

**GAUTAM CHIKITSALAY (W.W.)**
**P.O. Katri Sarai (Gaya)**
**Pincode: 805 105**

## నెరసిన జుట్టు

నల్లగా మారుతుంది

హెయిర్ డైతో పనిలేదు. మా ఆయుర్వేద చికిత్స ముందుగా జుట్టు నెరవటాన్ని మరియు వెంట్రుకలు రాలిపోవడాన్ని అరికడుతుంది. నెరసిన జుట్టు సహజమైన నలుపు రంగులోకి మారుతుంది. ఈ చికిత్స ద్వారా కోమలమైన మీ వెంట్రుకలు పొడుగ్గా పెరుగుతాయి. మెదడును చల్లగా వుంచుతుంది. కంటి బలహీనతలను అరికట్టడంలో ఎంతో ఉపయుక్తమైనది. ఒక కోర్సు ధర రూ. 100/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**GAUTAM CHIKITSALAY(O.J)**
**P.O. Katri Sarai (Gaya)**
**Pincode - 805 105.**

ఆ గులాబీ సౌందర్యాన్ని ఆస్వాదించి, అనుభవించి, జ్ఞాపకాల ముఖమల్ పెట్టిలో భద్రంగా, ఆ భావనలని దాచుకున్నప్పుడే నీకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ తెల్సినట్టు. 'ఆటో ఎక్కినందుకు ఫేర్ చెల్లించాను. దట్సాల్!" అనుకోవచ్చు. కానీ నేను కొన్ని నిమిషాలు అతనితో కలిసి ఎన్నో దృశ్యాలని పరికించుకుంటూ – ఎన్నో రోడ్లని, ఎంతో ట్రాఫిక్‌ని దాటుకుంటూ ప్రయాణించాను. నన్ను క్షేమంగా, సౌకర్యంగా తీసుకువచ్చినందుకు, నేను అతడ్ని మనసారా అభినందించాను. నా అభినందనలని అందుకున్న అతను, తన మరో ప్రయాణీకుడికి తన 'గుడ్‌విల్'ని అందిస్తాడు. సాధారణంగా ప్రయాణీకులు, ఆటోవాళ్ళ శత్రు రాజ్యపు సైనికుల్లా అరుచుకుంటూ, మీటరు మీద ఎక్స్‌ట్రా డబ్బులు అడిగినందుకు తిడుతూ – తిరిగి తిట్టించుకుంటూ వుంటారు. కానీ నేను ఇలా అభినందించడంవల్ల, పీటర్ హృదయం సాఫ్ట్ అవుతుంది. అతను ప్రయాణీకుల్ని శత్రువుల్లా కాక తనతో ప్రయాణించే స్నేహితుల్లా చూడగలుగుతాడు. నేను అభినందిస్తున్నప్పుడు అతని మొహంలో కదిలిన చిర్నవ్వు చూశావా, అది అతను మరో ప్రయాణీకుడి మొహంలో వికసింపచేస్తాడు.'

"కానీ ఇదంతా కేవలం నీ వూహ ఏమో. నిజంగా పీటర్ నువ్వు అనుకున్నట్టు ప్రవర్తించకపోవచ్చు."

వికాస్ నవ్వుతూ – "అయితే ఏం. నేను ప్రయత్నిస్తూనే వుంటాను. ఎందుకో తెల్సా. స్వార్థం. అవతలి వ్యక్తులకిఆనందం ఇచ్చేటప్పుడు – నా హృదయం ఎంతో తృప్తి పడుతుందో – నాకు ఎంత ఆత్మానుభూతి కలుగుతుందో–"

ఎదురుగా వున్న మూర్తి ఫోటో చూడగానే – "మూర్తి బావున్నాడోయ్. పెళ్ళి టైమ్‌లో కన్నా ఇప్పుడు ఒళ్ళు చేసినట్టున్నాడు. ఏ మాటకి ఆ మాట చెప్పుకోవాలి. మీ ఆయన అందగాడు –" అన్నాడు చిర్నవ్వుతో.

జ్యోత్స్న స్టన్ అయినట్టు చూసి "అందగాడా?" అంది.

ఆమె ఎప్పుడూ భర్త గురించి ఇలా అనుకోలేదు.

"అవును. ఆ కళ్ళు చూడు. సన్నగా, లోతైన నిశితమైన చూపులతో సాగి ఈ చివర నుంచి ఆ చివర వరకూ – చెంపలకి సరిపడా ఎంత బావున్నాడు –"

జ్యోత్స్నకి ఆ కళ్ళనే తను ఎన్నోసార్లు 'చీరి కళ్ళు' అనుకోవడం గుర్తుకువచ్చింది.

"ఫేస్ కట్ చూడు. వెరీ హేండ్సమ్. గుండ్రటి చుబుకం –"

ఆమెకి ఆశ్చర్యం కలిగింది – 'తను మొద్దు మొహం అనుకుంటున్న మొహం హేండ్సమ్,

"రూపంలోనే కాదు పర్సనాలిటీ కూడా ప్లెజంట్ అయ్యి వుండాలి. ఇంటెలిజెంట్ అయ్యి వుండాలి. లేకపోతే బి.కామ్. చదివి, ఒక ప్రైవేట్ ఫర్మ్‌లో ఎకౌంట్ ట్రెయినీగా 800 రూ.ల స్థాయినుంచి, 6 సంవత్సరాల్లో ఎకౌంట్స్ చీఫ్‌గా 8000 రూ. పై స్థాయికి ఎదిగాడంటే – మస్ట్‌బి వెరీ స్మార్ట్ ఫెలో – "

జ్యోత్స్న స్టన్ అయ్యింది. వికాస్ ... కాలేజీలో తాము కలిసి చదువుకున్నప్పుడు – తనతో సహా అందమైన అమ్మాయిలంతా – వికాస్‌ని షార్ప్, ఇంటెలిజెంట్, స్మార్ట్ గై, ఛార్మింగ్ చాప్' అని ఆరాధించేవాళ్ళు. ఆ వికాస్ తన భర్తని ఎడ్మైర్ చేస్తున్నాడు.

లేచి అల్మారాలో వున్న అంజలి ఫోటో చూస్తూ ఆనందంగా నవ్వేస్తూ – "చిన్ని జ్యోత్స్న –" అన్నాడు.

"అదేమిటి?"

"నువ్వు ఐదేళ్ళ పాపాయివి అయిపోతే ఇలాగే వుంటావు" అన్నాడు తన్మయంగా.

తన కూతురు తన పోలికా? తనకి ఎప్పుడూ అలా కనబడలేదే – అనుకుంటూ – "నీకు ఎంత మంది వికాస్" అంది.

వికాస్ పాకెట్‌లోంచి పర్సు తీసి – అందులోంచి ఫోటో తీసి ఆమెకి అందించాడు.

ముప్పై ఏళ్ళ ఆహ్లాదమైన చిర్నవ్వు వ్యక్తిత్వంతో కూర్చున్న పవిత్ర ఒళ్ళో ఇద్దరు కవల పిల్లలు క్యూట్‌గా వున్నారు.

"బావున్నారు కదూ–" అన్నాడు ఆనంద తమ కంతో.

ఒక్కసారి ఎందుకో ఆమెకి ఈర్ష్యగా అనిపించింది.

హఠాత్తుగా – "అయితే వికాస్! నన్ను మర్చిపోయావా?" అంది.

వికాస్ మొదట తెల్లబోయి, మరుక్షణం నవ్వేసి – "కాలేజీలో నాతో పాటు చదివిన నా క్లాస్‌మేట్, నేను ఆరాధించిన జ్యోత్స్నని మర్చిపోలేదు."

"అంటే ఆ జ్యోత్స్నని నేను కాదా –"

వికాస్ చిర్నవ్వుతో – "మధురమైన జ్ఞాపకాలు జీవితాన్ని వెలిగించేటట్టు వుండాలి గానీ దుఃఖపెట్టేట్టు వుండకూడదు. ఆ రోజుల్లో నా కవిత్వానికి నువ్వు ఆధారం. ఈ రోజు నా ఆనందమయ సంసారానికి ముక్కాని పవిత్ర. మీమీ పరిధుల్లో మీరు నాకు ఎంతో ఆనందాన్ని కలిగించారు. ఇందులో కంపేరిజన్ అనవసరం. అలాగే నువ్వు నన్ను మాత్రమే గుర్తుపెట్టుకుని మూర్తిని, అంజలిని నిర్లక్ష్యం చేస్తుంటే మాత్రం – నేను చింతించాల్సి వస్తుంది. ఇటువంటి కుంచిత మనస్తత్వం వున్న స్త్రీనా – నేను ఆనాడు ఆరాధించాను అని –"

జ్యోత్స్న ఆ మాటలకి గిలగిల్లాడింది. ఆమెలో

మారుతున్న భావాల్ని గమనించి కూడా పట్టించుకోకుండా – "అవునూ – జ్యోత్స్నా! ఇదివరకు ఎప్పుడూ, అప్పుడే మంచులో కడిగిన నందివర్ధనంలా వుండేదానివి. ఇదేవిటి ఇలా వున్నావు" అన్నాడు.

జ్యోత్స్న తడబడుతూ – "ఇంకా స్నానం చెయ్యలేదు" అంది.

"ఏమిటి పదిన్నర దాటుతుండగా కూడా –"

"అదే – వంటా అదీ పూర్తిచేసుకుని –"

వికాస్ నవ్వేశాడు. "మీ అమ్మాయిలు విచిత్రమైనవాళ్ళు. చదువుకునే రోజుల్లో, ఎవర్నో తమకి అంతగా తెలీని, సంబంధం లేని అబ్బాయిల్ని ఆకర్షించడానికి అలంకరణలు. పెళ్ళయ్యాక – అసలు ప్రేమించి, ఆకర్షించుకోవల్సిన వ్యక్తి ఎదురుగా వున్నా కూడా మడ్డికారుకుంటూ –"

జ్యోత్స్న వుడుక్కున్నట్టుగా – "నువ్వేం నవ్వనక్కరలేదు–" అంది.

వికాస్ –"జ్యోత్స్నా వచ్చినప్పటి నుంచీ చూస్తున్నా. నువ్వు ఒక్కసారి కూడా చిర్నవ్వు నవ్వలేదు. ఏదో నవ్వుని మర్చిపోయినదానిలా హౌ స్ట్రేంజ్..." అన్నాడు.

"నేను అదే ఆశ్చర్యపోతున్నా. వచ్చినప్పటి నుంచీ నువ్వు అదే పనిగా నవ్వుతున్నావు. పాతాళగంగ వుబుకుతున్నట్టుగా – నీలోంచి నవ్వు తెరలు తెరలుగా... వింతగా వుంది–"

"వింత ఏముంది జ్యోత్స్న. నవ్వు ... ఆనందం.. మనిషికి అత్యంత సహజమైనవి."

"ఆనందం ఏముంది ఇంకా ఈ జీవితంలో–"

"అదేమిటి? ఏమయింది జ్యోత్స్నా అలా మాట్లాడుతున్నావు –"

"ఏమో! అంతా చేజారిపోయినట్టు, దిగులుగా, అవ్యక్తమైన బాధ, నీరసం, నిస్సత్తువ."

వికాస్ ఆమె ఎదురుగా నిల్చుని, ఆమె కళ్ళల్లోకి ఆర్తిగా చూస్తూ – "జ్యోత్స్నా జీవితం పట్ల మన దృష్టి ఎలా వుంటే, అలా మన జీవితం కనిపిస్తుంది. నువ్వు బేసిక్‌గా 'ఆనందాన్ని గుర్తించడం, అనుభవించడం, ఆస్వాదించడం' మానేశావు. దాంతో నీ దృష్టి కుంచించుకుపోయి, నీలోంచి నెగెటివ్ థింకింగ్ ప్రారంభమయింది. చెప్పు – ఎందుకు నీకు దుఃఖంగా వుంది. మూర్తి నిన్ను కొడతాడా? తిడతాడా? విసుక్కుంటాడా?"

"లేదు"

" మరి– అంజలి సరిగ్గా చదవదా? ఏక్టివ్‌గా వుండదా? ఆరోగ్యం బావుండదా?"

"కాదు"

అతను వంగి ఆమె భుజాల్ని పట్టుకుని – "అయ్యో! జ్యోత్స్నా చూశావా? నీ బాధకి అర్థమే లేదు. లాజిక్ లేదు. రీజన్ లేదు. నువ్వు చిర్నవ్వు వునికినే మరిచిపోయావు. అవతలి వ్యక్తుల్లో వున్న స్వచ్ఛతని, అభిమానాన్ని, ఆరాధనని గుర్తించడం మానేసి చీదరించుకోవడం మొదలుపెట్టావు. ఎందుకని అలా? లవ్‌దెమ్ ... ప్రేమించు, అన్నిటినీ ... అందరినీ. అభినందించు, అన్నిటినీ... అందరినీ. చిర్నవ్వుల్ని మొలకెత్తించు. వాటినీ అందరికీ పంచు. చిర్నవ్వుతో నీ వునికిని అందరికీ తెలియపరుచు. ఆ అనుభవంలో ఎంత ఆనందం వుంటుందో ఒక్కసారి ట్రై చెయ్యి. మూర్తి, అంజలి, పనిమనిషి, పాలమనిషి, కూరగాయల కొట్టువాడు, లాండ్రీ వాడు, బ్యాంక్ క్లర్కు, పోస్ట్‌మేన్... ఇలా అందరినీ ... ఒక్కసారి ఒక్కసారి 'చిర్నవ్వు'తో ట్రై చేసి చూడు –"

ఆమె ఏదో అద్భుతం విన్నట్టు వింటోంది.

ఈలోగా పనిమనిషి అంజలికి మధ్యాహ్న భోజనం తీసుకువెళ్ళడానికి వచ్చింది. జ్యోత్స్న ఏదో నిర్ణయించుకున్నట్టుగా "నేను తీసుకువెళతాలే అంజుకి భోజనం" అంది.

ఆ మాటలు వినగానే వికాస్‌లో చిర్నవ్వు కలిగింది. అతడి చిర్నవ్వు గమనించగానే జ్యోత్స్న మొహం చిర్నవ్వుతో ప్రఫుల్లమయింది. ◇


## ఇవి మీకెంతో ఉపయోగం

తరచు వచ్చే రోగాలకయ్యే విపరీత ఖర్చు తగ్గించడానికి, అవసరమునకు ఆదుకొని, మీకు చాలా ఉపయోగపడే, ప్రతి ఇంటా ఉండతగిన తెలుగు వైద్య పుస్తకాలు.

**అల్లోపతి సర్వస్వం :** అల్లోపతి అనే ఇంగ్లీషు వైద్యానికి, టానిక్కులు, టాబ్లెట్లు, కాప్స్యూల్సు, అయింటుమెంట్సు, ఇంజెక్షన్లు అన్నీ సుమారు రెండువేల మందులున్నాయి. ఏ రోగానికి, ఏ మందు వాడాలి, మోతాదులు, తీసుకోవలసిన జాగ్రత్తలతో సహా డాక్టరు విశ్వనాథ రాజు, MBBS, DCH, గారు వివరించిన పుస్తకము వెల రూ.50.

**అయిదు వైద్య విధానాలు :** 400 రోగాల నివారణకు, ఇంగ్లీషు, ఆయుర్వేద, ప్రకృతి, చిట్కా, హెూమియో, డాక్టర్లు వివరించిన 5 రకాల మంచి వైద్య విధానాలు గల పుస్తకము వెల రూ. 40.

**ఆహార వైద్యము :** ఆహారాల్లో సహజంగా ఉండే మందులతో, ఏ రోగానికి ఏ ఆహారం తిని నయం చేసుకోవాలో, నిపుణులు తెల్పిన వైద్య విధానాలు గల పుస్తకము వెల రూ. 30.

**మూలికా వైద్యము :** అల్లం, మిరియాలు మొదలయిన మూలికలతో, ఖర్చులేని, పురాతన కాలం నుంచి వాడుకలోనున్న మంచి వైద్య విధానాలు గల పుస్తకము వెల రూ. 30.

పోస్టు ఖర్చు రూ.8 అదనం. రూ. 60కి అంతకన్నా ఎక్కువ విలువగల ఆర్డర్లకు పోస్టేజి ఉచితం. వీటిలో మీకు కావలసిన పుస్తకాలను, V.P. పోస్టు ద్వారా పంపించమని వెంటనే క్రింది అడ్రస్సుకు ఉత్తరం వ్రాయండి.

దేశసేవ పబ్లికేషన్స్
S.R. నగర్ పోస్టు, హైదరాబాద్ – 500 038.

## మీకుపయోగించే పుస్తకాలు

★ దైవదర్శిని:–జీవిత విజయాలకు, బాధల విముక్తికి, దైవాన్ని పొందిన సిద్ధులు తెల్పిన దివ్యమైన దైవ రహస్యాలు. వెల రూ. 30

★ వ్యవహారదర్శిని:–నిత్య వ్యవహారాలకు అనేక చట్టాల వివరాలు, వివిధ పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, వ్రాసే విధానాలు, అనేక నమూనాలతో వివరించబడినవి. వెల రూ. 30

★ సమగ్ర రేఖా చిత్రాలు:–రేఖా చిత్రాలు వేయుట నేర్చుకొనుటకు వీలుగా, సుమారు 2 వేల రేఖా చిత్రాలు గల 320 పేజీల పుస్తకము. వెల రూ. 40

★ అద్భుత హాస్యకథలు:–నవ్వి, నవ్వించటానికి, చిన్నచిన్న హాస్య కథలు. వెల రూ. 20

★ చేతిపనులు:–సర్దాకు, సంపాదనకు పనికొచ్చే వాటిని తయారు చేసుకొనే విధానాలు. వెల రూ. 20

★ మీ స్వప్న ఫలితాలు:–జరగబోయేవి ముందుగా సాంకేతికంగా స్వప్నాలలో కనబడతాయి. కలల ఫలితాలు తెల్పే స్వప్నాల డిక్షనరి.. వెల రూ. 20

★ రసిక ప్రియ కథలు:–చదివిన కొలది, చదవాలనిపించే వినోద శృంగార కథలు వెల రూ. 20

★ జీవిత రహస్యాలు:– దాంపత్య జీవిత సుఖాలకు, లైంగిక సమస్యల పరిష్కారానికి, మంచి చిట్కా మార్గాలు. వెల రూ. 20

★ యువతి:– యువతుల గురించి అనేక కుతూహల విషయాలు, వారి ప్రత్యేక సమస్యల పరిష్కార మార్గాలు. వెల రూ. 20

★ మంత్రశక్తి:–సంకల్ప సిద్ధికి వివిధ మంత్రాలు, వాటి జప నియమాలు. వెల రూ. 20

వీటి రచన **A.S. మూర్తి, M.A., B.L.**

పోస్టు ఖర్చు రూ. 8 అదనం; కానీ రూ. 60 కి, అంతకన్నా ఎక్కువ విలువగల ఆర్డర్లకు పోస్టేజి ఉచితం. వెంటనే ఈక్రింద ఎడ్రస్సుకు ఉత్తరం వ్రాసి వీటిని వి.పి. పోస్టు ద్వారా పొందండి. (పుస్తకములు అందాక డబ్బులు పంపవచ్చును)

దేశసేవ పబ్లికేషన్స్
S.R. నగర్ పోస్టు, హైదరాబాద్ – 500 038.